# కోసమెరుపు

ట్రింగ్ ... ట్రింగ్ ... టింగ్ ...”

యశోద ముఖం చిట్లించింది. రాత్రి తొమ్మిదయ్యింది. అప్పటిదాకా యశోద తమ్ముడు బుజ్జి మారాం చేసిచేసి అప్పుడే పడుకున్నాడు. బుజ్జికి అయిదేళ్ళు వచ్చాయి. సన్నగా నారవరపలా వుంటాడు వాడు. యశోదతల్లీ తండ్రీ సినిమాకు వెళ్ళారు. చలిగా వుందని బుజ్జిని, యశూని ఇంట్లో అట్టే పెట్టారు. యశోద బుద్ధిగా ఊరుకుందికాని బుజ్జీమటుకు రాగాలాపన మొదలెట్టాడు. వాడిని సముదాయించి కథలూ, కబుర్లూ చెప్పి పడుకోబెట్టింది యశోద. ఇంక మర్నాటిపాఠాలు చదువుకోవాలి. సంగీతంసాధకంచేసుకోవాలి. ఇప్పుడుమళ్ళీ ఈ ఫోనుపట్టుక కూర్చుంటే, ఇంక కబుర్లకి అంతుండదు. అంచేత ఫోను మోగుతున్నా వినిపించుకోకుండా వీణ తీసి ఇవతల పెట్టుకుంది. సంగీతం పుస్తంకూడా తెరిచి పెట్టుకుంది. చేతి వ్రేళ్ళకి కాస్త వాసలైన్ పూసుకొని ఒకసారి తీగలన్నీ టింగ్ టింగ్ మని మీటి శృతి సరిచూసుకొని వాయించుకొందుకు ఉపక్రమించింది యశోద. కాని ఫోన్ మటుకు ట్రింగ్ ట్రింగ్ మంటూ మోగుతూనే వుంది. యశోదకి విసుగేసింది. “ఈ ఫోను ఎందుకుందిరా భగవంతుడా! అనుకుంది యశోద. వాళ్ళింట్లో ఫోను కొత్తగా పెట్టారు.

యశోదావాళ్ళు భాగ్యవంతులు కారు. యశోద తండ్రి ఏదో కంపెనీకి ఏజంటుగా వుంటున్నాడు. నెలకి ఇర వయి రోజులు టూర్‌లోనేవుంటాడు. యశోదకి పదహారేళ్ళు నిండాయి. స్కూల్‌ఫయినల్ ప్యాసయి, సెకండరీగ్రేడ్ ట్రయి నింగ్ అవుతోంది. వీణ నేర్చుకుంటోంది. మళ్లీ సాయంత్రం స్కూలు వదలగానే కుట్లు నేర్చుకుందుకు కుట్లునేర్పే మిషన్ ట్రయినింగ్ స్కూలుకు వెళ్తుంది. ఆపాఠాలు నేర్చుకుని ఇంటికి వచ్చేసరికి సంగీతం టీచర్‌వ స్తుంది. అదికూడా నేర్చుకున్నాక డాబామీద ఇటూఅటూ తిరుగుతూ, బుజ్జితో కాలక్షేపం చేస్తుంది. రాత్రిళ్ళు - పదీ, పదకొండు గంటలదాకా నిశబ్ద నిశీథిలోని నీలాకాశంమీది తారకలని చూస్తూ, వీణ సాధకం చేసుకుంటుంది, ఈ ఫోను వచ్చాక ప్రక్క వీధి లోని జడ్జీగారమ్మాయి వసుధ ఊసు పోనప్పుడల్లా ఫోనులో పిలిచి బాతాఖానీ వేస్తూంటుంది. వసుధ కాలేజీలో పి. యు. సి. చదువుతోంది. చాలా అంద మైనది. చలాకీగలది. యశోదకూడా పి యు. సి. చదవాలని ఉబలాటపడింది కాని, తండ్రి, తల్లీ ట్రయినింగ్‌లో చేర్పిం చారు. యశోదా వాళ్ళుండేది మూడు అంతస్తులున్న భవ నంలో, రెండో అంతస్తులో మొదటివాటాలో వుంటున్నారు. ఈమధ్య కొత్తగా ఏ అంతస్తుకి ఆ అంతస్తులోనే వేరేవేరే ఫోన్సుపెట్టారు. వీళ్ళ అంతస్తు ఫోను యశోదవాళ్ళ డాబా మీది ముందరగదిలో వుంది. ఇంక వసుధ తీరుబాటుగా వున్నప్పుడల్లా ఫోనుముందుకూర్చునీ బాతాఖానీవేసేది. అందు

కని యశోదకి విసుగుపుట్టింది. అ విసుగుతోనే ఫోను రిశీవక్ పుచ్చుకుని,

'హల్లో! వసూ!' అంది.

'మీరు యశోదేనా!' మంద్రస్వరంలో పురుష కంఠం పలికింది. ఉలిక్కిపడింది యశోద, తన పదహారేళ్ళ జీవితంలో తండ్రి బుజ్జీతప్ప, మరో మగవాళ్ళ స్నేహం ఆమెకు తెలీదు అంచేత తొట్రుపాటుతో.

'అవును. యశోదనే మరి మీరు?' అంది. అవతలి కంఠము మృదువుగా నవ్వింది.

'నేనా! నా పేరా?'

సంభాషణలోని ట్విస్ట్ ముగ్ధురాలైంది యశోద.

'మీ పేరూ మీరుకూడా?'

'నేను రచయితను. పేరు అంబి రాజక్.'

యశోదకి తనువంతా కంపించింది. అంబిరాజక్ పేరు చాలా పత్రికల్లో చూసింది. ఆతని నవల్లు వెలువడ్డవన్నీ ఎలానో అలా సంపాదించి చదివేది. వసుధ, అతని 'ఆటో' కూడా సంపాదించింది. అది గొప్పగా ఎన్నోసార్లు చదువుకుని మురిసిపోతూంటుంది వసుధ,

'మీరా!' ఆమెగొంతు అద్భుత స్వప్నంలో మునిగి పోయిందని ఆతనికి తెలిసింది. తనలో తను నవ్వుకున్నాడు.

'నన్నిదివరకే తెలుసునా ఏమిటి?' ఆశ్చర్యపోతున్నట్లు అడిగాడు. యశోద ఉత్సాహంగా,

'తెలుసునా అని అడుగుతారేమిటి! మీ పేరు వినని వారూ. సారీ చదవనివారు మన ఆంధ్రాలోనే లేరుగా!' అంది.

'ఆంధ్రలోనే అనుకుంటున్నారావేమిటి?' విస్మయంగా అన్నాడు.

'కాక?'

'నా నవల్లు హిందీ లోకీ, కన్నడంలోకీ, మరాఠీ లోకీ, తమిళంలోకీ, ట్రాన్స్లేటు చేశారు.'

'అయితే అటు ఉత్తరాదివారికి, ఇటు దక్షిణాదివారికీ కూడా మీరు పరిచితులేనన్నమాట!'

'అంతేకాదు. మా ఫ్రెంచ్ మిత్రుడు ఒకడు. ఫ్రెంచి భాషలోకి కూడా అనువాదపు హక్కు ఇమ్మని కోరాడు.'

'ఇచ్చారా!'

'అదే ఆలోచిస్తున్నాను. ఇవ్వనా వద్దా అని.'

'ఇంకా ఆలోచిస్తారు దేనికని తప్పక వెంటనే ఇచ్చెయండి. మీ పేరు ఫ్రాన్స్ దేశమంతామార్మోగిపోతూంది.'

'ఇద్దామనే వుందికాని, బొత్తుగా డబ్బు తక్కువ, అని ఆలోచనగావుంది.'

'వెధవడబ్బు పోనిద్దురూ! అయినా ఎంతేమిటి?'

'మన రూపాయిల్లో పేజీకి ఆరురూపాయలు అయ్యేట్లు ఇస్తామన్నారు.'

'మొత్తం ఎన్ని పేజీలు ?'

'200 పేజీలు అవుతుందిలే ?'

'అబ్బ!' దిగ్భ్రమ చెందింది యశోద, రెండువందల పేజీలకి ఆరురూపాయల చొప్పున పన్నెండు వందల రూపాయలు వొస్తయ్ ! ఏం చక్కగా! ఆ రూపాయలు తన కేవస్తే నెక్లెస్ కొనుక్కున్ను, గాజులు చేయించుకున్ను, తను వ్రాస్తే తన కే వచ్చును. ఆ రూపాలేవో ! తనెందుకు వ్రాయకూడదు. వ్రాయలేదా !

'ఏమిటి ఆలోచిస్తున్నావ్ ?'

మీా నవలకి పన్నెండువందల రూపాయిలు వస్తోంటే ఇంకా తక్కువ అని గునుస్తున్నా రేమిటా అని.'

'తక్కువ కాదా ! మనవాళ్ళు పేజీకి పదీ పన్నెండూ ఇస్తారు నా నవల్లకి.' గర్వంగా అన్నాడు.

యశోదకి కళ్ళు మూతలు పడ్తున్నాయి. రెండుసార్లు ఆవలింతలొచ్చాయి. క్రింద తండ్రి గొంతు విన్పడింది. రిక్షా దిగారల్లే వుంది. డబ్బులు దగ్గర రిక్షావాడు గోలచేస్తున్నాడు. 'ముందు ఆరణాలకే బేరమాడా'నని తండ్రీ. 'అర్ధరూపాయిఅని సొప్పాను గదండీ బాబులూ !' అని రిక్షావాడూ వాదం వేసుకున్నారు. 'ఎంతో అంత ఇచ్చి పారెయ్యండీ !' అని మధ్య మధ్య తల్లి అంటూొంది. తండ్రి విన్పించుకోటంలేదు.

'ఇంక వుంటాను. మా నాన్నగారొచ్చారు.' అంది యశోద.

'ఏం వస్తే' ఫోనులో మాట్లాడినంత మాత్రాన్న తప్పా! మన తెలుగువాళ్ళు ఆడపిల్లల్ని వుత్త భయస్థులుగా పెంచుతున్నారు.' అన్నాడు. అంబిరాజన్.

'భయంకాదు. నా కేమి భయం లేదు. రేపొద్దుటి పాఠాలు చదువుకోవాలి హస్కు పెట్టుక కూర్చుంటే ఎల్లా!' అంది.

'పాఠాలు! ఏం పాఠాలు?'

'రేపటి పాఠాలు! నేను ట్రయినింగ్ అవుతున్నాను.'

'పంతులమ్మ వన్నమాట!'

'అదే!'

యశోద తల్లీ తండ్రీ పైకి వొచ్చేశారు. యశోద చప్పున రిసీవరు పెట్టేసి, చప్పుడు కాకుండా తన చాపమీద పక్క పరుచుకుని పడుకొని కళ్ళు మూసుకుంది. యశోద తల్లి డాబామీదకి వెళ్ళింది. చాపమీద వీణ, పుస్తకం అల్లాగే వున్నాయి. యశోద తల్లికి కోపం వొచ్చింది.

'యశూ! వీణని అల్లా మంచుకి వదిలేసి వచ్చావేం! తీయటానికి బద్ధకం వేసిందా! అంత కళ్ళమీదకి నిద్రముంచుక వచ్చేదాకా సాధకం చేయకపోతే ఏం!' అంటూ లేపింది.

యశోదకి తన తప్పు తెలిసి వచ్చింది. కళ్లు నలుముకొంటూ నిద్రనుంచి లేచిన దానిలా నటించి, వీణ, పుస్తకం తెచ్చి పెట్టెలో పెట్టుకుంది. మళ్ళీ వచ్చి పడుకుంది పడుకున్నదే కాని, నిద్రపట్టలేదు. యశోదకి. బలే చిత్రంగావుంది. అంబి రాజన్ తనకి తనుగా ఫోనులో పిలిచి మాట్లాడాడు. అతని పేరు యశోదకి తెలియటంలో ఆశ్చర్యంలేదు. కాని యశోద పేరు అతని కెల్లా తెలిసింది? అసలు ఫోనులో దేనికని పిలిచినట్లు! ఆసంగతేదో తేలకుండా నేఫోన్ పెట్టేసింది. యశోదనాల్కకొరుక్కుంది. ఎందుకు పిలిచాడో కనుక్కోనందుకు! ఏదో ఎన్నాళ్ళనించో తెలుసున్నట్లుగా అతను మాట్లాడటం, తను అంతకన్నా స్నేహితంగా కలుపుగోరుతనంగా తనుమాట్లాడటం యశోదకి ఎంతో వింతగా తోచింది. అతను ఎక్కడ్నించి ఫోనుచేసినట్లు; అదీ వింతగానే వుంది. రేపు టెలిఫోన్ డైరెక్టరీ చూస్తే సరి! అదీ తెలివిగానే తోచింది యశోదకి. అంతలోనే తను మర్నాటి పాఠాలు చదవకపోవటం. సంగీతం కూడా సాధకం చేసుకోకపోవటం గుర్తుకు వచ్చింది. ఇంకతెల్లవారుఝామునే లేచి కాస్సేపు చదువుకోవాలి కాస్సేపు పాడుకోవాలి రోజూ, వసుధని విసుక్కునేది. ఇవ్వాళ ఇతను అడ్డం వొచ్చాడు. ఎవరయితేనేం! అయినా ఇతని మీద యశోదకి విసుగు రాలేదు. 'వసుధ' అతను దాని, అటోగ్రాపు పుస్తకంలో వ్రాసిన రెండువాక్యాలు చదువుకుని మురిసిపోయేది. తను? తనతో రెండుగంటలసేపు మాట్లాడేడు. ఇది వసుధతో చెప్తే? వసుధకి బలే ఈర్ష కలుగుతుంది. ఇది ఒకళ్ళతో చెప్పే అదృ

ష్టమూ! తన హృదయంలో తనే పదిలపర్చుకుని, తలుచుకుని తలుచుకుని మురిసిపోవాల్సిన మురిపెం కదా! వసుధతో చెప్పకూడదు. అనుకుని నిశ్చయించుకొంది. అయినా ఆమె తెల్లవార్లూ నిద్రపోలేదు. తెల్లవారకట్ల యశోద తండ్రి ఏదో వూరు వెళ్ళాడు. ఆ హడావిడికి, యశోదకి చప్పున మెళుకువ వచ్చేసింది. అన్ని పనులూ అలవాటుచొప్పున చేసుకుంటున్నా ఆమె మనసు అంబిరాజన్ మృదుకంఠాన్నే స్మరించుతోంది. తొమ్మిది గంటలకల్లా భోజనంచేసి మధ్యాహ్నానికి టిఫిన్ కారియర్‌లో పెట్టుకుని తల్లితో చెప్పి క్రిందకు దిగింది. మేడ ముందరి ఖాళీస్థలంలో పూలమొక్కలూ అవీ వున్నాయి. పెద్ద పెద్ద చెట్లుండడంనుంచి ఆస్థలంఅంతటా ఎండుటాకులు రాలి వుంటాయి. క్రింది వాటాలలో వున్నవాళ్లు అప్పుడప్పుడు ఆ ఆకులు పోగుచేసి అంటించి వాటిమీద నీళ్ళు కాచుకుంటూ వుంటారు. ఆ కాలిన మసిఅంతా ఎగురుతూవుంటుంది. అంచేత పూలు పూస్తోన్న మొక్కలున్నా వాట్లకి సరయిన బాక్‌గ్రౌండ్ లేక, ఎండు టాకులూ, కాలిన మసీ ఎగురుతూ, దిక్కు లేని దివాణంలా వుంటుంది ఆస్థలం వీధిగేట్లో నల్లగా పొడుగ్గా సన్నగా వున్న ఒక వ్యక్తి నించిన్నాడు. షేర్వాణి సుర్వా వేసుకున్నాడు. చేతుల్లో ఏదో లావాటి ఫైలువుంది. యశోద అతన్ని తప్పించుక వెళ్ళాలి. చిన్నగా దగ్గింది. అతను వెనక్కు తిరిగి చూశాడు. యశోద అతను ఎవరికి చుట్టమూ, అని ఆలోచించింది. యశోదకి, తమ మేడలో వున్నవాళ్ళందర్ని తెలుసును. ఇతను చూడబోతే ఉత్తరాది మనిషల్లె కనుపించు

తున్నాడు. తమ మేడలో వున్న వాళ్ళంతా దక్షిణాది వాళ్ళే. ఇలా యశోద ఆలోచిస్తూండే క్షణంలోనే అతను నవ్వాడు పరిచయంగా.

'నువ్వేనా యశోదవి?' అని అడిగాడు. ఒక్క క్షణం యశోద నిర్ఘాంతపోయింది. రాత్రినించీ తనపట్ల ఏదోఅద్భుతం జరుగుతోనేవుంది.

'నేను నేను అవును మీకెల్లా తెలుసు?' అంది.

'నా పేరు దేవరాజు, వసుధ చెప్పింది నీ గురించి' నేను మొదటి అంతస్తులో మొదటి వాటాలో దిగాను. నిన్ననే!'

'అల్లాగా! నాకు తెలియదు. వసుధ మీకుబంధువా?' అంది.

'కాదు స్నేహితురాలు. నువ్వుకూడా చాలా స్నేహితంగా ఉంటావని చెప్పింది.' అన్నాడు దేవరాజు.

యశోద ఒక్క క్షణం అతనికేసి చూసింది. నల్లటి మొహంలో మాట్లాడినప్పుడల్లా తెల్లగా శంఖుపూసల్లా వున్న పళ్ళు మెరుస్తుంటాయి. అణగకుండా గాలికెగిరే జుట్టూ కళ్ళల్లో విచిత్రమయిన కాంతీ మనిషిని మామూలు తనానికి కాస్త ఎడంగా నిలబెట్టాయి.

'వొస్తాను. టైమయిపోతూంది' అంది యశోద.

'సైమయిపోతూందని నీకెల్లా తెలుసు? నీకువాచీలేదే?' అన్నాడు దేవరాజు.

'అలవాటు కద!' బయటకు నడిచింది. దేవరాజు కొంత దూరందాకా ఆమెతో కలసి నడిచి ఒక సందుమొగలో చీలిపోయేడు. వసుధ ఆంతర్యం ఏమిటో యశోదకి అంతుపట్ట లేదు ఎంతగా కాలేజీలో చదువుతూన్నా ఎంతగా గొప్పింటి పిల్లది అయినా ఈ అవ్యక్త స్నేహాలు ఆమె నెందుకు ఆనంద పరుస్తాయో యశోదకి తెలియదు। ఆమె అయితే ఎల్లాంటి వారితో స్నేహాలుచేసినా ఫరవాలేదు. కాని ఆ స్నేహాల వలల్లో, తన్నికూడా ఇరికించటం దేనికి?' 'నైవా శ్రితేషు మహాతాం గుణ దోష చిన్తా' అన్నట్లు వసుధ తల్లి దండ్రులు వసుధ ఏంచేసినా సమర్థిస్తారు. వసుధమీద వాళ్ళ వాళ్ళకున్న నమ్మకము తనమీద తన తల్లిదండ్రులకి లేదు. తల్లి దండ్రులకి పిల్లలమీద వుండే, అందులో ఆడపిల్లలమీద వుండే అప నమ్మకమే పిల్లలని ఎస్కేపిస్టుల కిందా, సినిక్ల కిందా తయారుచేస్తుంది అనుకుంది. యశోద సాయంకాలం అలిసిపోయి ఇంటికి రాగానే గేట్లోనే తారట్లాడుతూ కనపడ్డాడు దేవరాజు. ఫార్మల్గా 'గుడ్ ఈవెనింగ్' అంది. 'నీ కోసమే నించున్నాను' అన్నాడు.

'నాకోసమా! ఎందుకు?' విస్మయంగా అడిగింది.

'నేను వసుధ, దగ్గరకు పోతున్నాను. ఏమన్నా చెపావల్సుందా అని అడుగుతున్నాను.' అన్నాడు.

యశోద తేలిగ్గా నవ్వింది.

'వసూ ఏమన్నా చెప్పదలచుకుంటే ఫోనులో చెప్తుంది లెండి' అని పైకిపోయింది. యశోద, దేవరాజు తనలో తను నవ్వుకుంటూ బయటకు నడిచాడు.

యశోద పాఠాలన్నీ చదువుకుంది. స్నానంచేసి భోజనం చేసింది. బుజ్జితో డాబామీద అంతా పరుగెట్టుతూ ఆడుకుంది. తల్లి పనులు పూర్తిచేసుక వచ్చాక బుజ్జిని తల్లికి అప్పగించి తను వీణ, పాటలపుస్తకం తీసుకుని వరండాలోకి వచ్చింది. ఫోను ట్రింగ్ ట్రింగ్ మంటూ మ్రోగింది. ఒక్కసారి యశోద వళ్ళు ఝల్లుమంది. ఆ ఫోనులో పిలిచేది. అంబిరాజన్' అయి వుంటాడని ఆమె నిశ్చితం, వీణని చాపమీద పెట్టేసి ఫోను దగ్గరకు వెళ్ళింది.

'హల్లో యశూ!' వసుధ పిలిచింది. యశోదకి ఎక్కడ లేనివిసుగూ వొచ్చింది.

'ఏమే!' అంది.

'దేవరాజు అని నా స్నేహితులొకరు మీా ఇంటి క్రిందకు వచ్చారు. నిన్ను చూశానని కూడా చెప్పాడు.'

'అవునవును.' అంది యశోద.

'ఆయన కథలు వ్రాస్తారు.'

'అల్లానా!' దేవరాజుమీాద గౌరవం వచ్చింది యశోకి కాని, అతని పేరు ఎప్పుడూ చదువలేదు.

'ఎందులో వ్రాస్తారు!' అంది.

'హిందీలో వ్రాస్తారు. కవిత్వం, కథలూ కూడా!'

'హిందీలోనా!' చప్పబడింది యశోద ఉత్సాహం అంతా.

'ఏం! హిందీ నీకు నచ్చదు కాబోలే్న?' అంది వసుధ యశోద పకాపకా నవ్వింది.

'ఎందుకా నవ్వు?' అడిగింది వసుధ

'నవ్వక ఏం చేయనే? ఆయన నా నిమిత్తమే వ్రాస్తున్నట్లు, హిందీ నాకు నచ్చదా అని నీరసపడ్డావు మరి!'

అదికాదే యశూ! నాకు, నీకు హిందీ అంటే అట్టే ఇంట్రస్ట్ లేదని తెలుసుండీ, ఆయనతో నీకు కథలన్నా కవిత్వమన్నా ఇష్టమనీ నీతోకూడా స్నేహం చేసుకొమ్మనీ చెప్పాను.'

'పోన్లే! ఇప్పుడేం మించిపోయిందీ!'

'మించలేదు కాని, ఆయన నీతో మాట్లాడా లనుకున్నప్పుడల్లా మాట్లాడుతోండు!

'అల్లాగేలే'

'అల్లాగే అని తేలిగా అంటం కాదు. వాదాకరో!' వసుధ ధోరణకి యశోదకి నవ్వువచ్చింది.

'వాదా కరూంగీ!' అంది.

'నువ్వు' ఇప్పుడు ఏం చెప్పుకొంటున్నావు!' అంది. వసుధకి, యశోధకి సంగీతం సాధకం చేసుకొనే సమయమదని తెలుసును

'అరభివర్ణం... ఏం?' అంది.

'పాఠం వొచ్చిందా?'

'ముక్తాయిస్వరం రావాలి. ఇప్పుడు ప్రాక్టీస్ చేద్దామని వీణ నివతల పెట్టాను నువ్వు పట్టుకున్నావు.'

'ఇంకా ముక్తాయి స్వరంలోనే వున్నావా! నాతో నాలుగు రోజులక్రితమే చెప్పుకున్నానన్నావు.'

'ఏదీ, సాధకం చేయటంలేందే ఎల్లా వస్తుందే?' అంది.

'నా మూలాన్నేనా! నిన్న అంతా నిన్నుపలకరించనే లేదుకదే! నిన్న సినిమాకు పోయాను. వచ్చేసరికి ఆలస్యం అయ్యింది వస్తూనే నిద్రకు లోబడ్డాను.'

'నువ్వు కాకపోతే మరోరు? చంఘీజ్ ఖాన్, లేమర్లేన్ ఎవరైతేనేం?' నాలిక్కరుచుకుంది అన్నాక యశోద.

'ఒక్కొక్కరు కాలాంతకులు? అయితే నేను చంఘీజ్ ఖాన్ని అనుకుంటాను. మరి తామర్లేన్ ఎవరో నేనువినొచ్చా!' పరిహాసంగా అంది వసుధ. యశోద మాటాడలేదు.

'దాచుకో! అంత పరమరహస్యం కాబోలు.'

'రహస్యం కాదుకానీ...'

'ఆ కాసీతోనే తెలుస్తుంది లేవే! చెప్పద్దుకాని, ఆ వీరుడు మానవుడేనా?!' "ఛ ఛ! ఏమిటా మాటలు వసూ! నీ చిలిపితనం మితిమీరిపోతూంది."

"మతిమారితే మితిమీరినట్లు తోస్తుంది లేవే, ఏదయినా పరిమితంగా చూట్టం అలవాటు చేసుకోవాలి. లేకపోతే మతిస్థిమితం తప్పొచ్చు! జాగరూక్ రహో!'

'పహలే తుం చుప్‌చాప్‌రహో!" అంది యశోద. టైం పదకొండున్నర అయింది. వసుధకి నిద్ర వచ్చేస్తోంది.

"ఇంక పోతాను నిద్రవస్తోంది, అన్నట్లు దేవరాజు ఇక్కడే కూర్చుని వ్రాసుకుంటున్నాడు. పిలవనా? ఏమన్నా మాట్లాడతావా!"

"మేము మాట్లాడుకోవాల్సి వస్తే యంత్రసాహాయ్యం అక్కర్లేదు లేవే! సముఖంలోనే రాయబారాలు ఎందుకు!" అంది.

"అయితే పోయి పడుకుంటాను. నువ్వు నీ వీణానాదంతో ఆకాశంలోని చుక్కల్ని మీ మేడలోని మనుష్యుల్ని మేల్కొలుపు.' అంది వసుధ, యశోద టైంకేసి బిక్కగా చూసింది.

అయినా యశోదకి బాగా నిద్ర రావటంలేదు. లోపలి గదిలోకివెళ్ళిచూసింది. తల్లీ బుజ్జీ గాఢంగా నిద్రపోతున్నారు. మళ్ళీ ఇవతలికి వచ్చి వీణ ముందు కూర్చుంది. ఒక్కసారి

శృతి సరిచేసి చూచుకొని, 'సరాసీ జానాభా' అని పల్లవి ఎత్తు కుంది. పక్కవాటాలోంచి సుమతి వచ్చింది నెమ్మదిగా.

'చూడు యశూ! ఆయనకి బాగా తలనొప్పి ఉష్ణం వచ్చింది. ఇప్పుడిప్పుడే నిద్రపట్టింది కాస్త. కొంచెం నువ్వు తెల్లవారుఝామున సాధకం చేసుకోకూడదూ' అంది.

'మీ ఆయనకి ఉష్ణం లేనిదెప్పుడు సుమా! అంత సంగీతాన్ని భరాయించలేనివాళ్ళు చివరి వాటాలోకి మారకూడదా యేం?' కోపంగా అంది యశోద.

సుమతికి కూడా రోషం వేసుక వచ్చింది.

'సుశిక్షితమైన శ్రావ్య సంగీతమైతే, కర్ణవేద కలిగించదు. అంతేకాని, గండుపిల్లి అరిచినట్లు పాడుతూ, టుంయ్యి టుంయ్యిమంటూ, అపస్వరాలతో వీణ మీటుతూంటే, ఏం తోస్తుందీ! ఈ ఇల్లు నీ స్వంతమల్లే మాట్లాడుతావే! నువ్వెల్లా వచ్చావో అద్దెకి నేనూ అల్లానే వచ్చాను. నీపాటి అద్దె నేను ఇవ్వటంలేదా యేం! మూల వాటాలోకి మారిపొమ్మని నాకు సలహా ఇవ్వకపోతే నువ్వే మారకూడదు!' అంది సుమతి. సుమతి చాలా అందంగా వుంటుంది. పైగా నాగరీకంగా అలంకరించుకుంటుంది.

'నేను మూలవాటాలోకి మారాల్సిన అవసరం నాకేం? నేను మూలకిపోతే నువ్వు మేడమీదికి వచ్చేవాళ్ళకీ పోయే వాళ్ళకీ రిసెప్షనిస్ట్‌గా వుండొచ్చు అనుకుంటున్నావా?' అంది యశోద.

'మరే! ఏ టీచరుగానో? రిసెప్షనిస్టుగానో ఉద్యోగం చూసుకోవాలి ఇంక! వెక్కిరింతగా అంది సుమతి. యశోదకి అభిమానంతో కళ్ళునిండాయి ఈలోగా 'సుమా!' అంటూ సుమతి భర్త సుమతిని పిలవటంతో సుమతి తన వాటాలోకి వెళ్ళిపోయింది. యశోదకి యింక పాడుకోబుద్ధి కాలా. తనకి సంగీతం రాదు. పాడితే గండుపిల్లి అరిచినట్లుంటుంది పోనీ వాయిద్యం సాధకం చేసుకుందామంటే తీరిక వుండి చావటం లేదు. గొంతు బాగా వుండకపోవటం తన నేరమా! ఇన్ని రకాల మందులు కనిపెట్టున్నారు. గొంతులు సన్నగా కోకిలలా పలికేట్లు చేయగల మందు ఎందుకని కనిపెట్టలేక పోతున్నారు! తను సంగీతం నేర్చుకోవటం ఎవ్వరికీ ఇష్టం లేదు. తల్లికీ, తండ్రికీ కూడా ఇష్టంలేదు. 'నీకు రాదులేవే' అనేసేవారు. తను ఎంత గోల చెయ్యగా చెయ్యగా వీణ నేర్చుకుందుకు వీణ కొనిచ్చారు. అందరికీ తన సంగీతం అంటే ఎంతో లోకువ అయిపోయింది.' అనుకుంటూ వీణ దాచివేసి నిద్రపోయింది. మర్నాడు మళ్ళీ కాలేజీకి పోయేటప్పుడు, దేవరాజు గేట్లో నిలబడ్డాడు. పరిచయంగా చిన్న నవ్వు నవ్వింది యశోద.

'ఇవ్వాళ బాగానీరసంగా కనపడుతున్నావే?'అన్నాడు దేవరాజు. నిజంగానే యశోద ముఖం బాగా పీక్కుపోయింది.

'ఏం లేదు!' అంది.

'కారణం నాకు తెలుసును!'

'మీకా!'

'ఏం, తెలియకూడదా!' నెమ్మదిగా నవ్వాడు.

'తెలియకూడదని కాదు కానీ...'

'ఆ గీర్ఘ్యం అసందిగ్ధంగా వదిలిపెట్టావు.'

'సర్లేండి. మీకు తెలిసిందేమిటో చెప్పండి!'

'ఏమిటో ఆ జబరదస్తీ!'

'జబర్దస్తీ ఏం లేదు. మీరు చెప్తే ఆ జవాబు సరి అయినదో కాదో చెప్తాను.'

'రాత్రి వసుధ అంత రాత్రిదాకా హస్కు వేసిందా? ఆ పయిన నువ్వు చదువుకున్నావుకదా! మొత్తం అంతా రాత్రి ఏ పన్నెండో, ఒంటిగంటో అయి వుంటుంది నువ్వు పడుకునేసరికి' అన్నాడు.

రాత్రి వసు మాట్లాడటం మానివేయగానే నేను పడుకున్నాను. నిద్రపట్టేసింది.' అంది యశోద.

'అబద్ధం చెప్తున్నావ్, నువ్వు వీణవాయించుకోలేదా?' ఆశ్చర్యంగా అన్నాడు దేవరాజు.

'లేదు. ఇంక రాత్రిళ్ళు సాధకం చేసుకోను' రుద్ధ కంఠంతో అంది.

'అదేం!'

'రాత్రి మా ప్రక్కవాటా ఆమె పోట్లాడింది. నేను పాడితే వాళ్ళకి డిస్టర్బ అవుతున్నదట!'

'ఎవరూ! ఆ రెండుజళ్ళు వేసుకుని కాలాభస్మం పెడ్తుందీ, ఆవిడేనా?'

'అవును, మీ కెల్లా తెలుసు!'

'నువ్వెల్లా తెలుసో, ఆవిడా అల్లానే తెలుసును! కాని సుమతికి సంగీతం అంటే చాలా ఇంటరెస్టేనే, ఎందుకు నీతో పోట్లాడిందో కానీ!' ఆలోచనగా అన్నాడు.

'వాళ్ళాయనకి ఇష్టం లేదుట!'

'ఇష్టం లేదూ! అది అంతకన్నా శుద్ధాబద్ధం. అతను షణ్ముఖానంద సంగీతసభలో మెంబరు.'

'అంటే వాళ్ళకి నా సంగీతం ఇష్టంలేదేమో!' యశోద ముఖంకేసి చూశాడు దేవరాజు, నయాపైసలా వుంది ఆమె ముఖం.

'డిసప్పాయింట్ అయినావు బాగా, పోనీ, సాయంత్రాలు అలా బీచ్ కేసి ఎక్కడికన్నా పోయి సాధకం చేసుకో కూడదా?'

'అవును. నా సంగీతాన్ని మానవులు భరాయించలేరు. అక్కడైతే ఆ సముద్ర ఘోషలో, నా సంగీతం కలిసిపోతుంది. ఎవ్వరికి ఇబ్బంది వుండదు.

'నువ్వేమన్నా అనుకో! కాని, మన భావనలన్నీ విని తనలో ఇముడ్చుకునే దేముడు ఆ సముద్రుడే మరి!'

'అమ్మని కనుక్కోవాలి,' అంది. యశోద.

'దేనికి'

'అదే సాయంత్రాలు, అలా ఎక్కడికన్నా నిర్జన ప్రదేశాలకి వెళ్ళి, చదువుకుందుకు. పాడుకొందుకు?'

'నువ్వింకా చంటిపాపాయివా! ప్రతీపనికి అమ్మని అనుజ్ఞ కోరటానికీ, కొద్ది రోజుల్లో పంతులమ్మ వవుతావు కదా!'

'అయితే మటుకు దేనికి అదే. నాకు ఏ పనీ అమ్మ అనుజ్ఞ కోరకుండా చేయడం అలవాటు లేదు

'మంచి అమ్మాయివి!'

ఇద్దరూ ఎవరి గమ్యస్థానానికి వాళ్ళు వెళ్ళిపోయారు. యశోద తల్లితో తను రాత్రి సంగీతం సాధకంచేసుకోబోవడం సుమతి పోటాటకు రావడం చెప్పింది.

'అవును. అర్ధరాత్రి అంతా నిద్రపోయేవేళ మొదలు పెట్టావు. సాయంకాలమే పాడుకో!' అన్నదావిడ.

'సాయంకాలం నిశ్శబ్దంగా వుండదమ్మా! డాబా అంతా వచ్చేవాళ్ళూ పోయేవాళ్ళతో సందడి సందడిగా వుంటుంది పాడుకోబుద్ధి కాదు.'

'అయితే ఏం చేయాలంటావు? మానేస్తావా?'

'మానేయటానికా అమ్మా, నెలకి పదిరూపాయలిచ్చి నేర్చుకుంటుంట!'

'ఎదురు ప్రశ్నలు దేనికి? ఏం చేయాలనుందో చెప్పు!'

వసు ఇంటికి వెళ్ళి పాడుకుంటాను.'

'అలాగేలే! దానికింత నాన్చటం దేనికి పిచ్చిపిల్లా!' అంది యశోదతల్లి. ధైర్యంగా బీచ్‌కి వెళ్ళి పాడుకుంటానని చెప్పలేకపోయింది యశోద.

యశోద వీణ తెల్లవారుకట్ల సాధకం చేసుకొనేది పాఠం సాయంకాలాలు, బీచ్‌కో మైదానానికో వెళ్ళి పాడుకొనేది. ఇంక రాత్రుళ్ళు పనేం వుంటంలేదు అప్పుడప్పుడూ 'వసు' పలకరించి, బాతాఖానీ వేసేది. దేవరాజు మటుకు రోజూ ప్రొద్దుట రెగ్యులర్‌గా యశోదని కలుసుకునేవాడు. ఇద్దరూ ఆమాటా ఈమాటా చెప్పుకుంటూ యశోద ట్రయినింగ్ కాలేజీవద్దకు వచ్చేసరికి విడిపోయేవారు. ఒకరోజు ఇద్దరూ కలిసి వెళ్తూంటే యశోద తండ్రి కనబడ్డారు. యశోద ఒక్కసారి తప్పుచేసినదానిలా ముడుచుకుపోయింది. యశోద తండ్రిమటుకు దేవరాజును చూస్తూనే సైకిలు దిగాడు. నవ్వుతూ 'ఎంతవరకూ వెల్తున్నారు' అన్నాడు.

'అలా బజారుదాకాపోతున్నాను' దేవరాజు చెప్పాడు. యశోద, తండ్రి దేవరాజూ కలిసి కొంత దూరం నడిచారు. యశోద గుండెలు దడదడ లాడేయ్. యశోదకి, తండ్రివద్ద ఆట్టే చనువులేదు. ఇంటికి వచ్చేసరికి ఏమన్నా అంటారేమో అని భయపడింది. కాని ఇంట్లో ఏమీ అనలేదు బహుశా తన తండ్రికి పూర్వ పరిచయం వున్నదేమో అని సమాధానం పడింది. తండ్రివున్న నాలుగురోజులూ దేవరాజు తనకోసరం గేట్లో నిలబడ్డం మానేశారు 'నాన్నని చూస్తే ఈయనకి బిడియమల్లే వుంది' అనుకుంది యశోద తండ్రి నాలుగు రోజులుండి మళ్ళీ 'టూర్'కి వెళ్ళిపోయాడు. ఆరాత్రి మళ్ళీ చాలా కాలానికి టెలిఫోన్ మ్రోగింది. యశోద మామూలుగానే 'హల్లో వసూ!' అంది.

'వసునుకాను!' అవతలి కంఠం హసితస్వరంతో అన గానే యశోద శరీరం అంతా విద్యుత్ప్రసారం అయినట్లు ఝుల్లుమంది.

'ఎన్నాళ్ళకి' అప్రయత్నంగా అనేసింది.

'ఏమిటి ఎన్నాళ్ళకి!' అన్నాడు అంబిరాజన్ చిలిపిగా.

'చాలా రోజులకి పలకరించారు.' సిగ్గుపడింది యశోద.

'అయితే ఇన్ని రోజులుగా నన్ను తలుచుకుంటూనే వున్నావన్న మాట!'

'అంత ప్రతిరోజూ తలుచుకోలేదు కాని మీరెక్క డుంటున్నారో, మీరేం చేస్తూవుంటారో అడగలేదే అని అనుకున్నాను' అంది యశోద.

'ఆ రోజు ఇంకా చాలాసేపు మాట్లాడుదా మను కున్నాను. ఇంతలోకే మీ నాన్నగారొచ్చారని భయపడి వెళ్ళిపోతివాయే? మళ్ళీ నాకు తీరిక చిక్కలేదు.'

'నే నేం భయపడిపోలేదు. నిద్రవచ్చి పడుకున్నా నంతే! అయినా అంత తీరిక లేని పనేం వుంది మీకు?'

'నే నొక నవల వ్రాస్తున్నాను.'

'పూర్తి అయ్యిందా?' అంది జిజ్ఞాసగా.

'వో, ఇవ్వేళే అయ్యింది' వుల్లాసంగో అన్నారు అంబిరాజన్.

'హెడ్డింగ్ ఏమిటి?'

కొస మెరుపు ఏం బాగుందా?'

'కథనిబట్టే బాగోగులు, అసలు కథ ఏమిటీ ?'

'కథ నేను చెప్పటం మొదలుపెట్టే నువ్వు నిద్రపోతావు లేకపోతే మీ నాన్నొస్తే పారిపోతావు '

"ఫరవాలేదు ఇవ్వాళ మా నాన్నారు రారు నాకు నిద్రారాదు."

"మరి మీ ఫ్రెండ్ "వసుధ"ని పిలవొద్దని చెప్పు !

"ఆ సంగతి మీ కెలా తెలుసు ?"

"నా కన్నీ తెలుసులేవోయ్ !"

"మీకు దివ్యదృష్టివుంది కాబోలున్న"

"రచయితలకి దివ్యదృష్టి లేకపోతే ఎలా !"

"సర్లేండి కథ చెప్పండి."

"ఆవులింత లొస్తున్నాయే నీకు ? పాపం !"

'లేదు. చెప్పండి!' అంది.

'ఒకమ్మాయి వుంటుంది.'

'ఛీ ఛీ! మామూలు అమ్మాయి కథేనా ?' అంది యశోద.

'అమ్మాయిలు లేకుండగా కథలెలా నడుస్తాయ్ ?'

'నడుస్తాయని కాదు కాని, ఇంత పెద్ద రచయితలై వుండీ మామూలు అమ్మాల గురించిన కథలు వ్రాస్తే ఎలా అని !'

'రచయితలకి పెద్దా చిన్నా తేడా వుందా ఏమిటి ?'

'లేదా మరి ?' అంది యశోద.

'అసలు అమ్మాయిలు లేకుండా ఏదన్నా నవల కాని, నాటకం కాని, కావ్యం కాని వుందా? మనం అతి పవిత్రంగా చదువుకుండే రామాయణం ఏమిటి? ఒక మనసీయని స్త్రీ కోసం, ఒక రాజాధిరాజు పడ్డ బాధ! భారతంలో యుద్ధ రంగాలు ఎక్కువగావున్నా, స్త్రీల కథ కూడా అంతర్వాహినిగా సాగిపోయింది. అంబ నిప్పుల ప్రేమ, ద్రౌపదిమీద కీచకుడి మోహమూ, కన్యగా కుంతీదేవి మాతృత్వమూ, ఇవన్నీ అమ్మాయిల కథలు కావా ఏమిటి? ఆ అమ్మాయిల కథలు లేకుండగా, దాయాదుల యుద్ధమూ, గీతోపదేశమూ, వర్ణిస్తే ఆ భారతం ఎవరు చదువుతారు?'

'ఏం? సంస్కృతంలో ముద్రారాక్షసం లేదా?'

'వుంది కాని, ఆ నాటకం అభిజ్ఞాన శాకుంతలం, అంత పాప్యులర్ అయిందా! ఈ ప్రపంచంలో స్త్రీలు పురుషులూ వున్నారు. కలిసి జీవించుతున్నారు. అట్లాంటప్పుడు, స్త్రీలు లేకుండా ,పురుషులు లేకుండా వ్రాయాలంటం ఏం బాగుందీ! స్త్రీ పాత్రలు లేనివి స్త్రీలు చదువరు. పురుషపాత్రలు లేనివి పురుషులు చదవరు అధికజనామోదం పొందాలంటే ఉభయ వర్గ ప్రీతి కారంగా వుండాలి రచన!'

'బాగుంది మీ వాదన. అసలు కదలోకి రాండి!'

'ఇంతకీ నా వాదనెల్లా వుందీ!'

కథ చెప్పమంటూంటే వాదన మీది అభిప్రాయము అడుగుతారు దేనికి?'

'సర్లే! ఒక అమ్మాయుంటుంది. కొద్దిగా చిన్న వుద్యోగానికి సరిపోయేలా చదువుకుంది. ఇటు పూర్వకాలం అమ్మాయి

కాదు. అల్లా అని నాగరీకం అమ్మాయి కాదు. పరిస్థితుల్ని బట్టి ఆ అమ్మాయి చదువుకి తగ్గ వుద్యోగం చేసుకుంటోంది. ఆ డబ్బు యింట్లో తల్లికీ తండ్రికీ ఇస్తూంటుంది ఆ అమ్మాయికి పెళ్ళి చేయాలన్న వుద్దేశ్యమే తల్లి దండ్రులకి కలగదు. తనంత తనుగా ప్రపంచంలోకి చొరబడి, తనకి నచ్చినవాణ్ని వలచి, వలపించుకునే తెలివితేటలు ఆ అమ్మాయికి వుండవు. ఇంక తల్లిదండ్రులు వాళ్ళమటుకు వాళ్ళు పెళ్ళి ప్రయత్నాలు చేయరు. అల్లా అని ఈ అమ్మాయిని తేలిగ్గా వదలిపెట్టలేరు. కాస్త ఆఫీసునించి ఇంటికి ఆలస్యంగా వస్తే 'ఎక్కడికి వెళ్లావు? ఎవరితో మాట్లాడావు?' అని లక్ష ప్రశ్నలు వేస్తారు. వుద్యోగస్తురాలు కదా అని సరదాగా నలుగురితో మాట్లాడటం కాని, షికార్లు తిరగటం కాని చేయకూడదు. ఇల్లా రోజులు యాంత్రికంగా గడుస్తోంటే ఆ అమ్మాయికి జీవితంపట్ల విసుగు పుడుతుంది. ఒక రోజు కావాలనే స్నేహితురాలితో కలిసి సెకండు షో సినిమాకు వెళ్ళి రాత్రి రెండుగంటలు దాటిం తర్వాత ఇంటికి వస్తుంది. తండ్రికి కోపం వస్తుంది.

'ఎక్కడ్నించీ అర్ధరాత్రి రాక?' అంటాడు.

'సినిమాకు వెళ్ళాను' మునుపట్లా నీక్కగా కాక ధైర్యంగా అంటుంది ఆ అమ్మాయి.

'ఎవరితో వెళ్ళావు!' ఇంకో ప్రశ్న వేస్తాడు తండ్రి.

'స్నేహితులతో!'

'ఎవరా స్నేహితులు! ఆడా! మగా!' తండ్రి తీవ్ర ధోరణికి ఆ అమ్మాయికి కోపం ఎక్కువైంది.

'మగాళ్ళతో నేను షికార్లు వెళ్ళగల్గితే, మీా కోప తాపాలకు గురికావల్సిన అవసరం వుండకపోను' అంటుంది.

'ఇంత తెగించావనుకోలేదు' తల్లి తండ్రికి వంత పాడుతుంది.

'తెగించకుండగా వుండాలంటే నీ కాలంలోలాగే నాకూ పదేళ్ళ పిల్లప్పుడే, ఎవడో దానయ్యచేత ముడెట్టించ లేక పోయారా ! నన్ను ఇటూఅటూ కాకుండగా త్రిశంకు స్వర్గంలోలా పెంచడంఎందుకూ! అప్పుడు పెద్ద, రిఫార్మిస్టులా చదువులు చెప్పించి వుద్యోగాలు చేయించడం మొదలు పెట్టారు. మళ్ళీ వుద్యోగాల్లో చేరింది మొదలు, మనఅమ్మాయి మగాళ్ళతో మాట్లాడుతోంందేమో ఏదన్నా పాడయిపోతుం దేమో, అని భయపడుతూ బాధపడుతూ మమ్మల్ని భయ పెట్టారు. అవ్వాకావాలి బువ్వాకావాలి. అంటే ఎల్లా కుదురు తుందేం' అంటూ ఒక పెద్ద స్పీచ్ ఇస్తుంది. దానితో ఆ పిల్ల తల్లి దండ్రులు దీర్ఘాలోచనల్లో పడ్డా. వాళ్ళకి, 'కొసమెరుపువల్లె' ఒక ఆలోచన వస్తుంది. మనం పిల్లల్ని ఏదారిలో నడవాలనుకుంటామో, ఆదారి కనుగుణ్యంగానే వాళ్ళని పెంచాలి, సగం పురాతన భావాలతోను, సగం ఆధునిక భావాలతోనూ, కలగాపులగం చేసి, పెంచి వాళ్ళ పసిమనస్సుల్ని కలతబారనీయకూడదు. డెస్పరేట్ మూడ్ లోకి వచ్చిన యవ్వన మనస్సులతో వాళ్ళకి కావాల్సిన దేమిటో వాళ్ళకే తెలీవి, అయోమయ స్థితిలో పడి లేనిపోని అనర్థాలు కొని తెచ్చుకుంటారు.

'ఇదేగా నవలంతా' అంది యశోద.

'ఇదేనా అంటే అంతా ఇదే కాదనుకో ! కాని ముఖ్య భూమికని చెప్పాను.'

'చివ్వరికి ఆ అమ్మాయేమి అవుతుంది ?'

'ఏమీ అవ్వదు !'

'ఏమీ అవ్వకుండా నవల ఎల్లా పూర్తి అవుతుందీ !'

'అల్లానే పూర్తిచేశాను. ఆ అమ్మాయి తల్లిదండ్రుల నీడలో, ఆడుతూ పాడుతూ వుద్యోగం చేసుకుంటూ వుంటుంది.

'కొసమెరుపంటే ఇదేనా ?'

'ఇదికాక ! మన ఆలోచనలు, మెరుపుల్లాంటివి. ఒక్కొక్క మెరుపు మెరిసినప్పుడల్లా చీకట్లోవున్న రాళ్ళూ రప్పలూ బాటలోవున్న ఎగుడూ, దిగుడూలూ, కనపడతాయి. అల్లానే ఒక్కొక్క ఆలోచన మెరిసినప్పుడల్లా వాళ్ళు చేస్తూన్న, చేయ బోతూన్న అవకతవకలు మనస్సుకి తట్టుతాయి వాటిని అనుసరించి, నడుచుకుంటూంటేనే జీవనపథము నిష్కంటకంగా, నిరామయంగా సాగుతుంది.'

'నాకల్లా నచ్చలేదు. ఇంకా ఏదో వ్రాయాల్సుంది. అది అసందిగ్ధంగా వదలిలేశారనిపిస్తూంది.'

'అయితే ఏం చేయమంటావో చెప్పు ?'

'ఆ అమ్మాయికి, ఒక అబ్బాయితో పరిచయం అయి నట్లు, ఆ అబ్బాయిని ఈ అమ్మాయి ప్రేమించినట్లు, వాళ్ళ పరిచయ పూర్వక ప్రణయాన్ని ఆ అమ్మాయి తల్లితండ్రులు

ఆమోదించినట్లూ వ్రాయాలి వ్రాస్తే ఆ నవలకి నిండుతనం వొస్తుంది,'

అంబిరాజ్ తనలో తను నవ్వుకున్నాడు. మేఘం అంతా మెరవదు. మేఘం కొస మాత్రమే మెరుస్తుంది ఆ మెరుపులో మేఘం నిజరూపం కనపడుతుంది. 'యశో !' అపేక్షగా పిలిచాడు.

'ఏమిటి ?'

'రేపొకసారి బీచ్ కి రా, నేను ఈ నవలని నువ్వు చెప్పినట్లే ముగిస్తాను సరేనా !' అన్నాడు.

యశోదకి కాస్సేపు ఏదోలా అనిపించింది. విశ్వవిఖ్యాత రచయిత ఒక అనుభవంలేని చిన్నపిల్ల సలహామేరకు తన నవలని దిద్దుకోవటమా ?

'ఏమిటి ఆలోచిస్తున్నావ్ ?'

'ఆలోచిస్తున్నానా ?' తనకే తెలియనట్లు అంది

'మరి మాట్లాడవేం ! రేపొకసారి తప్పక రా ! వస్తావ్ కదూ !'

'అల్లాగే ! కథని నేను చెప్పినట్లు ముగిస్తారా ! నిజంగా!'

'అంతా చెప్తానుగా ! తప్పకుండా రా, గుడ్ నైట్,' 'క్లిక్' మన్న చప్పుడువినిపించింది యశోదకి, యశోద మనస్సు గాలిలో తేలిపోసాగింది. తన కేదో మహాదృష్టం పట్టనున్నట్లు భావనరాగా, శరీరం అంతా పులకరించిపోయింది. మర్నాడు స్కూలుకి సెలవు పెట్టేసింది. తల్లిఅడిగితే తలనొప్పిగా వుందని చెప్పింది. సాయంకాలం నాలుగింటికే స్నానం చేసేసి, తల్లితో 'వసుధ' ఇంటికి వెళ్తానని చెప్పి బీచ్ కివెళ్ళి కూర్చుంది. ఎగిరేఆ

ఇసుక కణాల్ని చూస్తుంటే అంబిరాజన్ ఎల్లావుంటాడో అనే ఆలోచన వచ్చింది. అతను ఎల్లావుంటే తన కేం? ఆ ఆలోచనకి నవ్వుకూడా వచ్చింది యశోదకి.

'హల్లో యశూ!' వెనక్కి తిరిగింది యశోద, వసుధ, దేవరాజూ నవ్వుతూవచ్చి పక్కన కూర్చున్నారు.

'నాతో మాటమాత్రమయినా చెప్పకుండగా వచ్చేశావేం?' నిష్టూరంగా అంది వసుధ.

'ఎవ్వరికోసమో ఎదురుచూస్తోంది!' అన్నాడు దేవరాజు. యశోదముఖం అరుణిమని పులుముకుంది.

'సెర్టన్లీ! ఆ ముఖమే చెప్తూంది' అంది వసుధవుడికిస్తూ

యశోద మనస్సులో ఎక్కడో మూల 'అంతా చెప్తానుగా! తప్పకుండా రా!' అన్న సుప్తగొంతు వినపడుతోంది.

'మౌనం అర్ధాంగీకారంఅన్నారు' దేవరాజు.

మీ ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానం చేసుకోండి' అంది యశోద నంజుపడింది. బీచ్‌లో వున్నవాళ్ళు ఒకొక్కళ్ళే వెళ్ళిపోతున్నారు. వసుధా, దేవరాజూ ఆమాటా ఈమాటా చెప్తోన్నా యశోద అన్యమనస్కంగా వుండిపోయింది. 'ఏం మనిషి? తన్ని ఆటలు పట్టించటానికి రమ్మనలేదు కదా!' అనుకుంది. ఇంక బాగా చీకటి పడుతుందనగా 'వసుధ' లేచి 'నేను పోతానే!' అంది. దేవరాజు మటుకు కదలలేదు. 'నేనూ వస్తానుండు.' యశోదకూడా లేవబోయింది. 'అంబిరాజన్' మీద బాగా కోపం కలిగింది: యశోదకి 'ఎందుకు పనిపట్టుకుని తన్ని వంచించాలీ? అని.

'మీరిద్దరూ ఒకచోటికే పోవాల్సుంది కదా. నాతో ఎందుకు ?' అంది వసుధ.

'అన్ని అల్లాంటి మాటలే ?' అంది యశోద.

మాటలకేముంది ? మనిద్దరం కలిసి వెళ్ళొచ్చులే కూర్చో' అన్నాడు దేవరాజు. వసుధ వెళ్ళిపోయింది

'నీ కివ్వాళ మనస్సు కుదురుగా లేదుకదూ?' అన్నాడు.

'ఏం ఖర్మ మనస్సు కుదురులేక పోవటానికి ?' ఎదురు ప్రశ్న వేసింది. యశోద నిజానికి ఆమె హృదయం బాగా దెబ్బతిన్నది

'నాకు తెలుసులేవోయ్ ! అంబిరాజన్ వస్తానని రాలేదు కదూ ?'

దిగ్భ్రమగా చూసింది దేవరాజు వెంపు

'ఎలా తెలిసిందనా అడుగుతున్నావ్ ! నువ్వు చెప్పిన 'ఎండింగ్' అతనికి నచ్చలేదుట! అలా వ్రాయలేనప్పుడు నిన్ను కలుసుకునీ ప్రయోజనమేమిటి ? అందుకని సాయంత్రం 'జనతా'లో హైద్రాబాదు వెళ్ళిపోయాడు. ఈ సంగతి నన్ను నీతో చెప్పమన్నాడు' యశోదకేసిచూస్తూ అన్నాడు. దేవరాజు.

'మీరు బాగా తెలుసున్నారా ఆయన్ని?' పసితనంగా అడిగింది యశోద.

'ఆఁహా! బాగా తెలుసును' అన్నాడు.

యశోద కళ్ళమ్మట నీళ్ళుకారాయి. ఎందుకో ఆమెకే తెలియలా! తను చెప్పిన 'ఎండింగ్' నచ్చనందుకా ? అతన్ని చూడలేక పోయినందుకా! రెండూ కూడానా!

'అదేం - ఎందుకూ? గాభరాగా అడిగాడు దేవరాజు.

'పోనీ కథ నేను చెప్పినట్లు ముగించకపోతేమానే! ఒక్కసారి కనబడకూడదా ఏం!' రుద్ధకంఠంతో అంది యశోద.

'అతను' కనపడితే ఏంచేస్తావో అదే నాతో చెప్ప కూడదా!' అన్నాడు.

'ఏం చెప్తాను! నేను చెప్పాలనుకున్నది ఏమీలేదు.' నిర్లిప్తంగా అంది.

'పోన్లే! నాదగ్గర ఎప్పుడూ దాపరికమేనా!' అపేక్షగా అన్నాడు దేవరాజు.

'దాపరికం ఏంలేదు. నిజంగా నేను చెప్పాలనుకున్నది ఏమీలేదు. ఆ మనిషి తీరువే అంత! కనపడనప్పుడు ఏం మాట్లాడా లనుకుంటానో, అదే తను తీరా పలకరించేటప్పటికి మర్చిపోతాను. ఏదో ధోరణిగా సాగిపోతుంది సంభాషణ. అంతంటూ తేలకుండా!' అంది తనలో తను అనుకున్నట్లు.

'అదే నిష్కల్మషమైన అప్యాయతకి చిహ్నము. ఒకరి నించి ఇంకొకరు ఏమీ కోరుకోకుండా స్నేహితంగా వుంటం చాలా అదృష్టం యశూ!'

యశోద ఇంటికి వెళ్ళటానికి లేచింది. దేవరాజు కూడా లేచాడు. ఆరాత్రి యశోద అలసిపోయినట్లు నిద్రపోయింది. మర్నాడు తెల్లవారుఝామునే లేచి సంగీతం పుస్తకం ముందు వేసుక కూర్చోబోతుంటె టెలిఫోను 'ట్రింగ్' మంటూ మ్రోగింది. ఒక్క అంగలో ఫోనుదగ్గరికి వెళ్ళింది యశోద.

'హల్లో యశూ!'

వసుధ గొంతువినిఆశ్చర్యపోయింది యశోద. ఏమంటే వసుధ ఎప్పుడూ ప్రొద్దుట ఎనిమిదయితే కాని లేవదు.

'ఏమే అప్పుడే లేచావ్!' అంది యశోద.

'దేవరాజు వెళ్ళిపోయాడు తెలుసా!' అంది వసుధ.

'అదా ముఖ్యవార్త? వెళ్ళితే వెళ్ళనీ!'అందియశోద.

'అదికాదే! అతని నవలకి నువ్వు చెప్పిన 'ఎండింగే' ఇచ్చానని చెప్పమన్నాడు.'

'నేనేం చెప్పలేదే?' అంది. విస్మయతంగా యశోద.

'అదే! 'కొసమెరుపు' నవలకి చెప్పలా?'

'అయితే ఆ నవల వ్రాసేది అంబిరాజన్ కాదా?'

'ఆయనే! వారే వీరు.'

యశోదకి ఒక్కసారి ప్రౌఢత్వం వచ్చేసింది.

'నాతో చెప్పలేదేం!'

అంబిరాజన్, మా పెదనాన్నగారి అబ్బాయేనే! మీ ప్రక్కవాటాలోవుండే 'సుమతి'కిఅన్నయ్యఅవుతాడు కూడా!'

'అదేలే! నాదగ్గర ఎందుకని దాచావు?' కోపంగా అంది.

'అదే చెప్తాను విను. 'స్టీవెన్ క్రేన్' అని ఒక కథా రచయిత ఉండేవారట! ఆయన కథల్లో రియలిజం సృష్టించటంకోసరం. ఆ అవస్థల్ని అనుభవించి, మరీ వ్రాసేవారట! 'ది ఓపెన్ బోట్' కథని సృష్టించబోయే ముందు, పదిఅడుగులున్న డింగీలో సముద్రం నీటిమీద ముప్పైగంటలు అల్లల్లాడిపోతూ గడిపి తీరానికి చేరుకున్నారుట. అల్లానే ఐడియలిస్ట్

అయిన మా అన్నయ్య 'కొసమెరుపు' నవల వ్రాయటానికి ఒక విరిసీవిరియనికుసుమంలాంటి కన్నెహృదయాన్ని, అవగతం చేసుకుందుకు నాసహాయం కోరాడు. నేను నీగురించిచెప్పాను. మా అన్నయ్యకి నువ్వు బాగా నచ్చావు. మీ ఇంటి క్రింది వాటాలో అద్దెకి వున్నాడు నిన్ను గమనించటానికి. కాని ఇంకో చిక్కు తెచ్చిపెట్టావు నువ్వు!'

'నేనా! ఏం చేశాను?' అమాయకంగా అడిగింది యశోద.

'ఏం చేశావో, నీకు జ్ఞాపకంలేదా!'

'నిజం నాకు జ్ఞాపకం రావటంలేదు.' అంది యశోద.

వసుధ గలగలా నవ్వింది.

చెప్పమంటుంటే 'ఆ నవ్వేమిటి!' చిరాకుగా అంది యశోద.

'అంత తొందరెందుకు? చెప్పదలచుకున్నవాళ్ళు చెప్పితే మధురంగా వుంటుంది. ఇంతకీ మాఅన్నయ్య ఒకనెలరోజుల్లో తిరిగి వస్తాడట. నవల ఎండింగ్ అంతరస స్ఫోరకంగా దిద్దినందుకు నీకు మెనీమెనీ థాంక్స్ చెప్పమన్నాడు. నువ్వు నాతో మాటమాత్రం చెప్పకుండగా ఇంత దొంగపని చేస్తావనుకోలేదే యశూ!' వుడికిస్తూ అంది వసుధ.

'ఛీ! ఛీ! అలా మాట్లాడకు'

ఫోను పెట్టేసి, పక్కమీద జారబడి తనలోతను నవ్వుకుంది యశోద.

*　　*　　*